కోర్టు ఉత్తర్వులుంటేనే పునరాలోచిస్తాం

ఆర్‌డిఒ దాసిరాజు

ప్రజాశక్తి - పాలకోడేరు

కోర్టు ఉత్తర్వులు ఏమైనా ఉంటేనే ఎసైన్డ్ భూముల విషయంలో పునరాలోచిస్తామని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. మండలంలోని పాలకోడేరు, మోగల్లు గ్రామాల్లోని జగనన్న లేఅవుట్ స్థలాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకోడేరు కోడిగట్టు జగనన్న లేఅవుట్ స్థలాన్ని పరిశీలించిన ఆయన పరిహారం కోసం నిరసన వ్యక్తం చేస్తున్న రైతులతో మాట్లాడారు. ఎసైన్డ్ భూముల విషయంలో అధికారులు నిబంధనల ప్రకారం పనిచేస్తున్నట్లు వివరించారు. లేఅవుట్లో పనులను అడ్డుకుంటే చర్యలు తీసుకుంటానన్నారు. ఆయన వెంట తహశీల్దార్ ఎస్‌కె.హుస్సేన్, ఎంపిడిఒ ఎన్. మురళీ గంగాధరరావు, గృహ నిర్మాణ శాఖ డిఇ బివి.రమణ, సిబ్బంది ఉన్నారు.

మట్టి మాఫియా ఆగడాలు..!

మండలంలో మట్టి మాఫియా ఆగడాలు మితిమీరి పోతున్నాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారం పెద్ద ఎత్తున సాగుతుండడంతో ఆ స్థలాలను పూడ్చడానికి మండలంలోని పంట పొలాల నుంచి నిబంధనలకు విరుద్ధంగా యంత్రాలతో మట్టిని తవ్వి ట్రాక్టర్లపై తరలించి విక్రయిస్తున్నారు. వరి పొలాల్లోని మట్టిని తవ్వాలంటే రెవెన్యూ గనుల శాఖ నుంచి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అయితే ఎటువంటి అనుమతులు లేకుండానే ఇక్కడ నుండి మట్టిని ఇతర ప్రాంతాలకు తరలించేస్తున్నారు. అధికారులు మామూళ్లు తీసుకుంటూ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొడమంచిలిలో పంట పొలంలో యంత్రాలతో మట్టిని తవ్వి ట్రాక్టర్‌పై లోడ్ చేస్తున్న వైనం

నిబంధనలకు విరుద్ధంగా పంట పొలాల్లో మట్టి తవ్వకాలు
మామూళ్ల మత్తులో అధికారులు

ప్రజాశక్తి - ఆచంట

మండలంలోని ఆచంట, కొడమంచిలి, కోడేరు, వల్లూరు, ఆచంట వేమవరం, పెనుమంచిలి తదితర గ్రామాల్లోని సారవంతమైన భూముల్లోని వేల ట్రాక్టర్ల మట్టిని తవ్వేస్తూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కోట్లు గడిస్తున్నారు. అనుమతులు తీసుకోకుండా అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి భూ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారని పలువురు విమర్శిస్తున్నారు. మెరక పంట పొలాలను పల్లం చేసుకుంటున్నామంటూ రైతులతో దరఖాస్తులు ఇప్పించి తవ్వేస్తున్నారని సరిహద్దు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందల ట్రాక్టర్లు అధిక మట్టి లోడుతో రహదారులపై మితిమీరిన వేగంతో ప్రయాణిస్తున్నాయి. ఎక్కువ ట్రిప్పులు వేయడమే లక్ష్యంగా ఈ వ్యవహారం సాగుతోంది.

మట్టి రవాణాల్లో ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు నిబంధనలు పాటించడం లేదు. రవాణా, రెవెన్యూ, మైనింగ్, వ్యవసాయ శాఖ అధికారులు ఉదాశీనంగా వ్యవహరించడంతో మట్టి రవాణా చేసే వ్యాపారులకు మూడు పువ్వులు ఆరు కాయలుగా మారింది. ప్రయివేటు ట్రాన్స్‌పోర్టర్లు అర్హత లేని లైసెన్సు లేని డ్రైవర్లతో మట్టి రవాణా చేస్తున్నా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడంపై పలు విమర్శలు గుప్పుమంటున్నాయి. మైనింగ్ శాఖ సర్వేయర్ సూచన మేరకు క్యూబిక్ మీటర్‌కు చాలానా చెల్లించి మట్టి తవ్వుకోవాల్సి ఉంది. అయితే అధికారులు మామూళ్ల మత్తులో మట్టి రవాణాకు అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. ట్రాక్టర్ ట్రక్కు డోర్‌కు సమానంగా మట్టిలోడు వేసుకుని పైన బరకం కట్టుకోవాలి. కానీ ట్రక్కు పైకి మట్టి లోడు వేసుకొని బరకాలు కట్టుకోకుండా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మట్టి మాఫియాను అరికట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుచున్నారు.

ఐసెట్‌లో మెరిసిన జిల్లా విద్యార్థులు

ప్రగడవరం విద్యార్థికి 6వ ర్యాంకు - కవిటం విద్యార్థినికి 10వ ర్యాంకు

ఐసెట్‌లో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన అఫ్తాబుద్దీన్ రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించగా, పోడూరు మండలం కవిటం గ్రామానికి చెందిన అంబళ్ల మహలక్ష్మి పదో ర్యాంకు సాధించింది.

అంబళ్ల మహాలక్ష్మి

అఫ్తాబుద్దీన్

ప్రజాశక్తి - పాలకొల్లు

పోడూరు మండలం కవిటంకు చెందిన అంబళ్ల మహాలక్ష్మి ఐ సెట్‌లో 10వ ర్యాంకు సాధించింది. గతేడాది కూడా ఆమెకు 38వ ర్యాంకు వచ్చింది. అయితే సాఫ్ట్‌వేర్ ఉద్యోగం రావడంతో ఎంబిఎలో చేరలేదు. 4 నెలల పాటు ఉద్యోగం చేసిన మహాలక్ష్మి ఉద్యోగం మానేసి ఎంబిఎ చేయాలని మరలా చదివి ఈ సారి 10వ ర్యాంకు సాధించింది. తల్లి శ్యామలాదేవి గృహిణి, తండ్రి సత్యకుమార్ ఎన్‌సిసిలో ప్రయివేటు ఇంజినీర్‌గా పనిచేసిన రెండేళ్ల క్రితం మృతి చెందారు. అయితే తండ్రి ఉద్యోగం రీత్యా ఆమె చిన్నతనంలో పలు పాఠశాలల్లో విద్యాభ్యాసం చేయాల్సి వచ్చింది. మహాలక్ష్మి 1, 2, 3 తరగతులు హైదరాబాద్, కడపలో, 4, 5 కవిటంలో, 6వ తరగతి తాళ్లపూడిలో, 7 నుంచి 10వ తరగతి వరకూ నెల్లూరులో చదివింది. ఇంటర్, డిగ్రీ పాలకొల్లులోని ఆదిత్య కళాశాలలో చదివింది.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సాధించాలని..

తాను మంచి కళాశాలలో ఎంబిఎ చేస్తానని మహాలక్ష్మి చెప్పారు. కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్ష రాసి ఇన్ కం టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా ఉద్యోగం చేయాలని ఆశిస్తున్నట్లు చెప్పారు. తన చెల్లెలు బిటెక్ చదివి పోస్ట్ మాస్టర్‌గా పేరుపాలెంలో పనిచేస్తోందని, తమ్ముడు 9వ తరగతి చదువుతున్నట్లు చెప్పారు. తనకు తాతయ్య భాస్కరరావు, నానమ్మ అప్పాయమ్మ (మాజీ సర్పంచి) స్ఫూర్తి అని చెప్పారు.

చింతలపూడి: ఐసెట్ 2023 పరీక్షా ఫలితాల్లో చింతలపూడి మండలం ప్రగడవరం గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్తాబుద్దీన్ రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించాడు. ప్రగడవరానికి చెందిన ఉపాధ్యాయిని షేక్ ఖాదర్‌బీ పెద్ద కుమారుడు మహ్మద్ అఫ్తాబుద్దీన్ చిన్నతనం నుంచి చదువులో ముందుండేవాడు. పదో తరగతి వరకు చింతలపూడిలో చదువు కొనసాగించి అనంతరం ఇంటర్ విజయవాడలో పూర్తి చేశారు. భవిష్యత్తులో ఎంబిఎ పూర్తి చేసి ఐటిలో ప్రాజెక్టు డైరెక్టర్ మేనేజర్‌గా చేయాలనేది తన లక్ష్యమని అఫ్తాబుద్దీన్ తెలిపారు. తన కుమారుడు రాష్ట్రస్థాయిలో ఆరో ర్యాంకు సాధించడంపై అఫ్తాబుద్దీన్ తల్లి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అఫ్తాబుద్దీన్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

జెడ్‌పి ఛైర్మన్‌గా ఏం వెలగబెట్టారు?

నవుడూరు సెంటర్ వద్ద బహిరంగ చర్చకు రండి
కవురు శ్రీనివాస్‌కు సిపిఎం మాజీ ఎంపిపి జుత్తిగ నరసింహమూర్తి సవాల్

వీరవాసరంలో నిరసన వ్యక్తం చేస్తూ మాట్లాడుతున్న జుత్తిగ నరసింహమూర్తి

ప్రజాశక్తి - వీరవాసరం

జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కవురు శ్రీనివాస్ ఏం వెలగబెట్టారో వీరవాసరం మండలం నవుడూరు సెంటర్ వద్ద బహిరంగ చర్చకు రావాలంటూ సిపిఎం సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి జుత్తిగ నరసింహమూర్తి సవాల్ విసిరారు. జగనన్న కాలనీల్లో పూడిక పేరుతో మట్టిని అక్రమంగా దోచుకుంటున్న అధికార ప్రజాప్రతినిధులకు వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని హెచ్చరించారు. యలమంచిలి మండలం చించినాడ గ్రామంలో దళితులు, పేదల పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తున్న అధికార ప్రజాప్రతినిధుల తీరును నిరసిస్తూ బాధితులకు సంఘీభావం తెలియజేస్తూ గురువారం సిపిఎం, టిడిపి నాయకులు వీరవాసరం బస్టాండ్ సెంటర్ వద్ద సిపిఎం మండల కన్వీనర్ పోతుల మృత్యుంజయ అధ్యక్షతన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జుత్తిగ నరసింహమూర్తి మాట్లాడుతూ ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ కమ్యూనిస్టుల పట్ల అవాకులూ, చవాకులూ మాట్లాడుతున్నారన్నారు. కమ్యూనిస్టులను విమర్శించే స్థాయి శ్రీనివాస్‌కు లేదన్నారు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా, వీరవాసరం మండలానికి ఎంపిపిగా, ఉత్తరపాలెం ఎంపిటిసిగా నెగ్గిన నీవు ప్రజలకు నీవు ఏం వెలగబెట్టావో చెప్పాలని, నవుడూరు సెంటర్ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేశారు. చించినాడ పంచాయతీ అభివృద్ధిలో కమ్యూనిస్టుల పాత్ర ఎవరు దాచినా దాగదన్నారు. జగనన్న కాలనీల పేరుతో ఇక్కడ మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తూ అడ్డంగా దొరికిపోయినా నీతుల చెప్పడం వైసిపి నాయకులకే చెల్లిందన్నారు. చించినాడలో అరవై ఎకరాలు గోదావరి లంకభూములను సుమారు నాలుగు వందల కుటుంబాలు నలభై సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నాయన్నారు. ఆ భూములను ఆనుకుని ఉన్న పెరుగులంక భూముల మట్టిని జగనన్న కాలనీలకు పూడిక పేరుతో నరసాపురం ఎంఎల్‌ఎ ముదునూరు ప్రసాదరాజు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ తరలిస్తున్నారన్నారు. అక్కడ భూమిని తవ్వితే వరదల సమయంలో కిందనున్న పట్టా భూములకు, గ్రామాలకు ముప్పుతప్పదన్నారు. అధిక మట్టితో లారీలు ఏటిగట్టు వెంబడి వెళ్తే ఏటుగట్టు బలహీనంగా మారే ప్రమాదం ఉందన్నారు. ఈ నేపథ్యంలో స్థానికులు మట్టి తరలింపును అడ్డుకుంటే వారిపై పెట్టారని, అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపిపి వీరవల్లి చంద్రశేఖర్ మాట్లాడుతూ దళితులు, పేదల ఓట్లతో గెలిచిన ఈ ప్రభుత్వం వారి పట్ల నిరంకుశంగా వ్యవహరిస్తోందన్నారు. అండలూరులో ఎంపిటిసి ఇదే తరహాలో భూదందాలకు పాల్పడుతున్నాడంటూ విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, టిడిపి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లేపర శ్రీనివాసరావు, వీరవల్లి శ్రీనివాసరావు, సిపిఎం నాయకులు లింగం సత్యనారాయణ, జ్యోతిబసు, సూర్యచంద్రరావు, సుబ్బారావు, చినవీరభద్రం, ఆలమహరాజు, రాంబాబు పాల్గొన్నారు.

దళితుల దీక్షలకు కెవిపిఎస్ సంఘీభావం

నిరసన దీక్షలో పాల్గొన్న నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ లంక భూముల్లో అక్రమ తవ్వకాలను నిరసిస్తూ దళితులు, పేదలు చేస్తున్న రిలే దీక్షలకు కెవిపిఎస్ జిల్లా బృందం గురువారం సంఘీభావం తెలిపింది. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.క్రాంతిబాబు మాట్లాడుతూ ఉమ్మడిగా సాగుచేసుకుంటున్న పేదల భూముల్లో అధికారులు అక్రమంగా భూ తవ్వకాలు జరపడం అన్యాయమన్నారు. పేదల ఇళ్ల స్థలాల పూడికకు మట్టిని తరలిస్తున్నామని అధికారులు చెబుతున్నారని, ఆ పేరుతో భారీ అవినీతి జరుగుతోందని విమర్శించారు. నరసాపురం మండలంలో ఇళ్ల స్థలాల పూడికకు ఆ నియోజకవర్గం మట్టి లేదా అని ప్రశ్నించారు. గోదావరి లంక భూముల్లో కేవలం దళితులు, బిసిలు, పేదలకు చెందిన 10 ఎకరాల పెరుగులంక భూముల్లో మాత్రమే ఎందుకు తవ్వుతున్నారన్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలో దాదాపు వందల ఎకరాల పెరుగులంక భూములు కొంత మంది భూస్వాముల వద్ద ఉంటే అవి ముదునూరి ప్రసాదరాజుకు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్‌కు కనిపించలేదా అని ప్రశ్నించారు. అక్రమ తవ్వకాలు ఆపేంతవరకూ ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. త్వరలోనే అన్ని దళిత సంఘాల జెఎసి నాయకులు లంక భూముల్లో పర్యటిస్తారని తెలిపారు. కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయకుమార్ మాట్లాడుతూ చించినాడ దళితులు నెలల తరబడి పోరాడుతుంటే జిల్లా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. అక్రమంగా పేదల భూముల్లో మట్టి తవ్వుకెళ్లిపోతుంటే నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అడిగితే అక్రమంగా అరెస్టులు చేసి, కేసులు బనాయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బాతిరెడ్డి జార్జి, సిపిఎం మండల కార్యదర్శి కానేటి బాలరాజు, పోరాట నాయకులు స్టాలిన్, రాజు, శ్రీనివాస్, ప్రియాంక పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



మొగల్తూరు : ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్‌వాడీల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మొగల్తూరులోని ఐసిడిఎస్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు చేసిన నిరసన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీలకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం తెలంగాణ కంటే అదనంగా వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.ఐదు లక్షలు వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం ఒంటిగంటలోపు కేంద్రాలు విజిట్ చేయరాదని కోరారు. అనంతరం సిడిపిఒ ఊర్మిలకు అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. తమ సమస్యలు పరిష్కారం కాకుంటే వచ్చే నెల 10, 11 తేదీల్లో కలెక్టర్ వద్ద నిరవధిక ఆందోళన చేయనున్నామని తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జి.పెద్దింట్లు, ఎస్.సారమ్మ, ఎ.సీతారత్నం, బి.రంగనాయకమ్మ, బి.జీవన కుమారి, ఎ.జయప్రభ, కె.మిస్సమ్మ పాల్గొన్నారు.

పెనుమంట్ర : అంగన్‌వాడీలకు జగన్ ప్రభుత్వం తెలంగాణ కంటే వెయ్యి రూపాయలు అదనంగా వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ ఐసిడిఎస్ సిడిపిఒ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీ యూనియన్ పిలుపుమేరకు సిఐటియు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రాజెక్టు లీడర్ కె.తులసి మాట్లాడుతూ ఐసిడిఎస్ పరిరక్షణకు, అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కోసం, కనీస వేతనం, పెన్షన్, పిఎఫ్, ఇఎస్‌ఐ సమస్యల పరిష్కారం కోసం అఖిలభారత అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నిరంతరం పనిచేస్తోందన్నారు. స్మార్ట్ మీటర్స్‌తో సంబంధం లేకుండా ప్రభుత్వం అంగన్వాడీ కేంద్రాలకు నిర్ణయించిన అద్దె రూ.2000 తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. హత్యకు గురైన అంగన్‌వాడీ టీచర్ హనుమాయమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇచ్చి రూ.25 లక్షలు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం సిడిపిఒ మేరీ ఎలిజిబెత్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.సుబ్బరాజు, ఎస్.వెంకటేశ్వరరావు, ఆచంట, పెనుగొండ, పెనుమంట్ర మండలాల అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



తణుకు రూరల్ :ధర్నా చేస్తున్న మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు

పర్మినెంట్ చేయాలని మున్సిపల్ కార్మికుల ధర్నా



గూడెం: కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

ప్రజాశక్తి - తణుకు రూరల్

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కామన మునిస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం రాష్ట్ర సంఘం పిలుపులో భాగంగా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు మున్సిపల్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో మున్సిపాల్టీల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులు సుమారు 40,000 మంది ఉన్నారని, వారందరినీ పర్మినెంట్ చేస్తానని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో వాగ్దానం చేశారని తెలిపారు. ప్రభుత్వం వచ్చి సుమారు నాలుగున్నర సంవత్సరాలైనా కార్మికులను పర్మినెంట్ చేయకుండా, కనీస వేతనం ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, దేశ ఉన్నత న్యాయస్థానం తీర్పు చెప్పిన దాన్ని ప్రభుత్వం అమలు చేయకపోవడం విచారకరమని అన్నారు. క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 జీతం ఇస్తామని ముఖ్యమంత్రి ప్రకటించినా దాన్ని అమలు చేయలేదన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ మాట్లాడుతూ ఆరోగ్యాలు సరిగ్గా లేకపోయినా మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నారని, వారందరినీ పర్మినెంట్ చేసే వరకూ కార్మికులు ఐక్యంగా పోరాడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులు నీలాపు ఆదినారాయణ బాబు, కొత్తపల్లి అయ్యప్ప, కె.నవీన్, ఎంటివి.గణేష్, కె.అమ్ములు, ఇ.దుర్గాప్రసాద్, కె.సత్యనారాయణ, ఎస్.పద్మ, శ్రీరాములు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం: మున్సిపల్ కార్మిక సమస్యలు పరిశీలించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక పురపాలక సంఘం కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ కార్మికులకు ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు కార్మికులకు పర్మినెంట్ కార్మికులతో సమానంగా వేతనాలు ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయలేదన్నారు. పర్మినెంట్ కార్మికులకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ధనాల దానయ్య, కొడమంచిలి బాబు, ఎస్.సతీష్, అల్లం పద్మ, కె.ధనరాజ్ పాల్గొన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు.

పవన్ కళ్యాణ్ పద్ధతి మార్చుకో : డిప్యూటీ సిఎం కొట్టు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పవన్ కళ్యాణ్ తన పద్ధతి మార్చుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ సూచించారు. తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కత్తిపూడి సభలో పవన్ కళ్యాణ్ చేసిన ప్రసంగం పతనం వైపు పరుగులు తీస్తున్నట్లు స్పష్టమైందన్నారు. అర్థం పర్థం లేని ఆరోపణలతో జనంలో చులకన అయిపోతున్నాడన్నారు. కాపు సామాజిక వర్గం అధికంగా ఉన్న గోదావరి జిల్లాలకు వచ్చి ఆ కాపులనే తిట్టడం పవన్ రాజకీయ అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. కాపు రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉన్నది ఉన్నట్టు చెప్పారు గాని కాపులను మోసం చేయలేదన్నారు. న్యాయపరంగా రిజర్వేషన్ కుదరదు కాబట్టే ఆనాడు జగ్గంపేట సభలో కాపు రిజర్వేషన్ సాధ్యం కాదని ధైర్యంగా చెప్పారన్నారు. 2014లో నువ్వు వత్తాసు పలికిన చంద్రబాబు కాపు రిజర్వేషన్ ఇస్తానని నమ్మించి ఓట్లు వేయించుకుని మోసం చేశాడన్నారు. పవన్ పద్ధతి చూసి కాపు జాతి సిగ్గుపడుతోందన్నారు. మేనిఫెస్టోలో లేనప్పటికీ కాపు నేస్తం అమలు చేస్తున్న ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి అయ్యే సీన్ లేదంటూనే మరోవైపు అధికారంలోకి వస్తే అది చేస్తా, ఇది చేస్తానని చెప్పడం పవన్ కళ్యాణ్ నిలకడ లేని మాటలకు నిదర్శనమన్నారు. అసలు ముఖ్యమంత్రి అభ్యర్థి నువ్వా చంద్రబాబా అని నిలదీశారు. పెళ్లి బిజెపితో కాపురం, చంద్రబాబుతో చేస్తావా అని విమర్శించారు. సంక్షేమ పథకాలను తప్పు పడతావా, దమ్ముంటే జనంలోకి వచ్చి సంక్షేమ పథకాలు తప్పు అని మాట్లాడితే ఆ జనమే తగిన గుణపాఠం చెబుతారని తెలిపారు. సమావేశంలో వైసిపి నాయకులు కర్రి భాస్కరరావు, ఎం.సంపత్‌కుమార్, కె.ధర్మరాజు, కోసూరి వెంకటరాజు పాల్గొన్నారు.

నిర్వాసితుల మహాపాదయాత్రను జయప్రదం చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

పాదయాత్ర పోస్టర్లను విడుదల చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి జులై 4 వరకు నెల్లిపాక నుండి విజయవాడ వరకు నిర్వహించనున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. గురువారం స్థానిక ఆదివాసీ విజ్ఞాన కేంద్రంలో పోలవరం నిర్వాసితుల పోరు కేక మహాపాదయాత్ర వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం నెల్లిపాక నుండి విజయవాడ వరకు 15 రోజుల పాటు 400 కిలోమీటర్లకుపైగా సుదీర్ఘ పాదయాత్ర చేస్తున్నారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టప్రకారం పునరావాసం, పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది వరదల్లో నష్టపోయిన వారికి పరిహారం చెల్లించాలని, గోదావరి వరదల నుండి నిర్వాసితులను రక్షించడానికి ప్రభుత్వాలు ముందస్తు సహాయక చర్యలు చేపటాలని కోరారు. 1986-2022 మధ్యకాలంలో గోదావరి వరదలకు మునిగిన గ్రామాలను మొదటి దఫాలో చేర్చి పరిహారం ఇవ్వాలని, కాంటూరు లెక్కలు మార్చాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు కేంద్రాల్లో సరైన వసతులు లేవని, ప్రభుత్వాలు తక్షణమే సదుపాయాలు కల్పించాలని అన్నారు. అసెంబ్లీ సాక్షిగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను ప్రతి నిర్వాసిత కుటుంబానికీ కాంటూర్లకు సంబంధం లేకుండా రూ.10.50 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. గ్రామాలు ఖాళీ చేసే నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెళ్లయిన వారికి కూడా ఆడపిల్లలకు ప్యాకేజి ఇవ్వాలని అన్నారు. నిర్వాసితులను తరలించిన ప్రాంతాల్లో ఉపాధి చూపాలని ఆయన డిమాండ్ చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మహా పాదయాత్రకు అంతా సహకరించాలన్నారు. ఈ నెల 26న జిల్లాలోని రుద్రమ్మకోటకు పాదయాత్ర వస్తుందని, కుక్కునూరు, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం, జంగారెడ్డిగూడెం మీదుగా విజయవాడ యాత్ర వెళ్తుందని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ వివరించారు. పోలవరం నిర్వాసితులు పోడు భూముల హక్కు పట్టాల కోసం, ఎల్‌టిఆర్, 1/70 చట్టం భూములను సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మరో పాదయాత్ర పోలవరం నుంచి బుట్టాయగూడెం చేరుకుంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో నేతలు తామా ముత్యాలమ్మ, పోలోజు నాగేశ్వరరావు, కె.భాస్కర్ పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పట్టణంలో 12వ వార్డు వైఎస్‌ఆర్ కాలనీవాసులు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను పరిష్కరించాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి గేదెల ధనుష్ కమిషనర్‌తో మాట్లాడుతూ కలుషితమైన తాగునీటితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. అలాగే చెత్త కుప్పలు పేరుకుపోయి దుర్భర పరిస్థితులను అక్కడ ప్రజలు అనుభవిస్తున్నారన్నారు. తక్షణం సమస్యలు పరిష్కరించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి రాపాక రమేష్ మాట్లాడారు. కాలనీ వాసులు నిరంతరం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని, అవసరమైన చోట్ల స్పీడ్ బ్రేకర్స్, రోడ్లపై పూర్తిగా వెలుతురు పడేలా వీధి లైట్లను ఏర్పాటు చేసి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని కమిషనర్‌ను కోరారు. అలాగే బలహీనంగా ఉన్న కరెంట్ స్తంభాలను కూడా పునరుద్ధరించాలని కోరారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ సమస్యలను తక్షణం కింది అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మాజీ నాయకులు మునుకోలు వైకుంఠం, డివైఎఫ్ఐ పట్టణ కమిటీ సభ్యులు ఆశీర్వాదం, స్టీఫెన్ పౌల్ పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - భీమవరం

ఇటీవల నిర్వహించిన జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్ఎంఎంఎస్)కు సంబంధించి ఫలితాలు విడుదలైనట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో లేదా ప్రభుత్వ పరీక్షల సంచాలకుల వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఈ పరీక్షలకు సంబంధించిన ఫలితాలు తెలుసుకోవచ్చని పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థుల మెరిట్‌కార్డులు త్వరలో ఉప విద్యాశాఖాధికారి కార్యాలయానికి పంపించనున్నట్లు తెలిపారు. జాతీయ విద్యా మంత్రిత్వ శాఖ నియమాల ప్రకారం ఎంపికైన విద్యార్థులు వెంటనే ఏదైనా జాతీయ బ్యాంకులో విద్యార్థి పేరున సేవింగ్స్ అకౌంటు తీసుకోవడంతో పాటు తండ్రి లేదా తల్లిని జాయింట్‌గా సేవింగ్ అకౌంట్‌లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థి ఆధార్ నంబరును మాత్రమే అకౌంట్‌కు జతపర్చాలని తెలిపారు. సేవింగ్స్ అకౌంటు కాకుండా వేరే విధమైన అకౌంట్లు (సుకన్య, ఫిక్సెడ్ డిపాజిట్) వంటివి పని చేయవని పేర్కొన్నారు. విద్యార్థి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ మెరిట్ కార్డులో ఉన్న విధంగానే ఆధార్ కార్డులోనూ, బ్యాంకు పాస్ బుక్‌లోనూ ఒక్క అక్షరం కూడా తేడా లేకుండా ఉండేలా చూసుకోవాలని వెల్లడించారు.



పనులను పరిశీలిస్తున్న పివిఎల్

రోడ్ల నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి - కాళ్ల

కలవపూడి సచివాలయం పరిధిలో వావిలాలపాడు, మోడీ గ్రామాల్లో పలు రోడ్ల నిర్మాణ పనులను డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు గురువారం పరిశీలించారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఇచ్చిన మాట ప్రకారం అభివృద్ధి కోసం రూ.10 లక్షలతో చేపడుతున్న పలు రోడ్ల పనులను పరిశీలించారు. ఆయన వెంట కలవపూడి సొసైటీ ఛైర్మన్ పెన్మత్స దుర్గా ప్రసాదరాజు, వైసిపి మండల కన్వీనర్ గణేశ్న రాంబాబు, వైసిపి నాయకులు తోట కూర చిన్నా, నాగరాజు, వెంకటరామరాజు పాల్గొన్నారు.

ఎస్ఎన్ఎంలో సరస్వతీ దేవి విగ్రహం ఏర్పాటు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలోని ఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ తల్లిదండ్రుల పేరున సరస్వతీ దేవి విగ్రహాన్ని గురువారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కళాశాల మరింత అభివృద్ధి చెంది యూనివర్సిటీ స్థాయికి ఎదగాలని డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ అన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, ప్రిన్సిపల్ రాజరాజేశ్వరి, మాజీ ప్రిన్సిపల్ సంగినీడి రంగారావు పాల్గొన్నారు.

ఎండలో దిశాయాప్ డ్రైవ్ చేస్తున్న మహిళా పోలీసులు

మండుటెండలో మహిళా పోలీసుల అవస్థలు

ప్రజాశక్తి - వీరవాసరం

మండుటెండలో మహిళ పోలీసులు అవస్థలు పడుతున్నారు. దిశాయాప్ డ్రైవ్ నిర్వహణలో వారు పడుతున్న అపసోపాలు వర్ణించలేని విధంగా ఉంది. విధి నిర్వహణలో ఎండ వేడికి తట్టుకోలేకపోతున్నామంటూ వాపోతున్నారు. గురువారం వీరవాసరం జాతీయ రహదారి ఎస్ఐ వీరభద్రరావు ఆధ్వర్యంలో దిశయాప్ డ్రైవ్ నిర్వహించారు. వాహనాలు ఆపి వాహనదారుల, ప్రయాణికులు సెల్‌ఫోన్‌లలో దిశాయాప్ డౌన్‌లోడ్ చేయిస్తున్నారు. ఈ క్రమంలో ప్రయాణికుల నుంచి ద్విచక్ర వాహణదారుల నుంచి మహిళా పోలీసులకు అసహనం వ్యక్తమవుతుంది. 40 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుంటే ఈ విధంగా దిశాయాప్ డ్రైవ్‌లు ఏమిటంటూ పోలీసులను ప్రశ్నిస్తున్నారు. నెట్‌వర్క్ సవ్యంగా లేకపోవడంతో ఒక యాప్‌ను డౌన్‌లోడు చేయించాలంటే సుమారు అర్ధగంట వరకు సమయం పడుతుంది. అప్పటి వరకు ఎండలోనే నిలబడి విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విధంగా అటు ప్రయాణికులు, మహిళ పోలీసులు, ద్విచక్ర వాహణదారులు ఎండకు తాళలేకపోతున్నారు. టార్గెట్‌లంటూ ఈ విధంగా ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య ఈ విధంగా డ్రైవ్‌లు నిర్వహించడం తగునా అంటూ వారు ఆవేదన చెందుతున్నారు.

నేరాలు - ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పోడూరు :రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయాలపాలైన ఘటన గుమ్మలూరులో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడేపల్లిగూడేనికి చెందిన కొడమంచిలి రామాంజనేయులు(25) గురువారం ఆచంట నుంచి పాలకొల్లు వైపు ద్విచక్రవాహనం పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో గుమ్మలురు వద్ద ఎదురుగా వచ్చిన శ్రీ చైతన్య కాలేజీ బస్సు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన రామాంజనేయులు భీమవరం ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. క్షతగాత్రుని బావ మండ సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామ్‌కుమార్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ఉక్కబోత.. కరెంటు కోత

గ్రామాల్లో జనం విలవిల

ప్రజాశక్తి - పోడూరు

ఒక పక్క ఎండలు మండిపోతున్నాయి. ఎన్నడూ లేని విధంగా రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరిగిపోతున్నాయి. దీనికితోడు గ్రామాల్లో అప్రకటిత విద్యుత్ కోతలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రతి రోజూ ఉదయం రెండు గంటలు, రాత్రి వేళల్లో ఏ సమయంలో కరెంట్ తీస్తాడో తెలియని పరిస్థితి నెలకొంది. చిన్న పిల్లల దగ్గర నుంచి పెద్ద వారి వరకూ కరెంట్ కోతలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం, రాత్రి సమయాల్లో కరెంట్ తీసేయడంతో కంటి మీద కునుకు ఉండడం లేదని గ్రామీణ ప్రాంత వాసులు ఆవేదన వక్తం చేస్తున్నారు. ఇటు ఉక్కబోత, మరో కరెంటు కోతలతో నరకయాతన పడుతున్నామని వాపోతున్నారు. అధికారులు అప్రకటిత విద్యుత్ కోతలు ఆపాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యామ్నాయ ప్రభుత్వం వైపు ప్రజల చూపు

మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమల్లో విఫలమైందని, అందుకే ప్రజలు ప్రత్యామ్నాయ ప్రభుత్వం వైపు చూస్తున్నారని మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్ చెప్పారు. పాలకొల్లు క్లాత్ మర్చంట్ అసోసియేషన్ భవనంలో గురువారం జరిగిన భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో మాట్లాడారు. రాష్ట్రంలో పోలీసులతో పాలన చేయాలని జగన్ భావిస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు తగిన విధంగా బుద్ధి చెబుతారని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ పరిశీలకులు పెచ్చెట్టి చంద్రమౌళి, కర్నేన గౌరు నాయుడు, పెచ్చెట్టి బాబు, జివి, నాయకులు పాల్గొన్నారు.

జగనన్న ఆణిముత్యాలు స్ఫూర్తిదాయకం : మంత్రి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

'జగనన్న ఆణిముత్యాలు' విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మార్కులు సాధించిన టెన్త్, ఇంటర్ విద్యార్థులకు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మంత్రి కొట్టు సత్యనారాయణ మెడల్స్, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. వారి తల్లిదండ్రులను, కళాశాల ప్రిన్సిపల్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో ఉత్తేజాన్ని పెంపొందించే విధంగా ముఖ్యమంత్రి జగనన్న ఆణిముత్యాలు తీసుకొచ్చారన్నారు. అమ్మఒడితో చదువుకునేవారి శాతం పెరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, కె.ధర్మరాజు, ముప్పిడి సంపత్‌కుమార్, ఎంఇఒ హనుమ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



విద్యార్థులకు మెడల్స్, నగదు అందజేస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

ఉండి:విద్యార్థులను మరింత ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రారంభించారని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం ఉండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మండల విద్యా శాఖ అధికారి ఎ.రవీంద్ర అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రతిభను మరింత వెలికితీసి ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమాన్ని రూపొందించారని తెలిపారు. నియోజకవర్గ స్థాయిలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన మొదటి ముగ్గురు విద్యార్థులకు, ఇంటర్‌లో ప్రతిభ చూపించిన మొదటి ముగ్గురు విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామని తెలిపారు. విద్యార్థులకు చదువు భారం కాకూడదని ఇప్పటికే పలు కార్యక్రమాలను రూపొందించిన జగన్మోహన్ రెడ్డి ఇప్పుడు సరికొత్తగా ఆణిముత్యాలు కార్యక్రమాన్ని రూపొందించారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతిస్తోందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, కాళ్ల జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావు, ఉండి సర్పంచి కమతం సౌజన్య బెనర్జీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉండిలో మెరిట్ విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న పివిఎల్

పాలకొల్లు : రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతిస్తోందని, విద్యార్థులు వాటిని ఉపయోగించుకుని మంచి భవిష్యత్తు ఏర్పాటు చేసుకోవాలని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ కోరారు. పాలకొల్లు బిఆర్ఎంవి మున్సిపల్ హైస్కూల్లో 'జగనన్న ఆణిముత్యాలు' కార్యక్రమంలో ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ గురువారం పాల్గొని ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఉత్తీర్ణత సాధించిన ఏడుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ రూ.5 వేలు చొప్పున రూ.35 వేలు సొంత నిధులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం నాడు-నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని కార్పొరేట్ వసతులు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ ఛైర్మన్ యడ్ల తాతాజీ, పట్టణ అధ్యక్షులు చందక సత్తిబాబు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి పాల్గొన్నారు.

వేల్పూరులో నాడు-నేడు పనుల పరిశీలన

ప్రజాశక్తి - తణుకు రూరల్

తణుకు మండలం వేల్పూరు 1, 5 ఎంపిపి పాఠశాలల్లో నాడు - నేడు పనులను గురువారం జిల్లా కలెక్టర్ ప్రశాంతి పరిశీలించారు. పాఠశాల ఆవరణ చెత్తా చెదారంతో అపరిశుభ్రంగా ఉండడం, అవసరానికి మించి ఎక్కువ మెటీరియల్ కొనుగోలు చేయడం, పొంతన లేని సమాధానాలు చెప్పడం వంటి కారణాలకు ప్రధానోపాధ్యాయులు, ఎపిఇడబ్ల్యు ఐడిసి ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యులైన వారికి ఛార్జి మెమోలు జారీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఇప్పటి వరకూ చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులు వెంటనే ఆన్‌లైన్లో అప్లోడ్ చేయాలని కలెక్టరు సూచించారు. ఎలక్ట్రికల్ సామగ్రి నిర్ణయించిన ధరలకు లోకల్‌లో కొనుగోలు చేయాలని కలెక్టరు సూచించారు. నాడు - నేడు పనుల్లో నాణ్యతలో గాని, ఖర్చుల్లో గాని వ్యత్యాసం వస్తే చర్యలు తీసుకుంటామన్నారు. నాడు- నేడు పనులు అకౌంటు బులిటీతో సీరియస్‌గా చేపట్టాలన్నారు. మిగిలిన పనులు శ్రద్ధ పెట్టి పూర్తి చేయించాలని కలెక్టరు సూచించారు. జిల్లాలో నాడు- నేడు కింద చేపట్టిన పనులు ఆర్అండ్‌బి అధికారులతో క్వాలిటీ చెక్ చేయించడం జరుగుతుందని తెలిపారు. కలెక్టరు వెంట జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, తహశీల్దార్ పిఎన్‌డి ప్రసాద్, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ పి.శ్రీనివాస్, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్స్ ఉన్నారు.

పనులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

అంగన్‌వాడీ కేంద్రాలతో పిల్లల్లో పురోగతి

ప్రజాశక్తి - ఆచంట

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లలు ఎంతో పురోగతి చెందుతారని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ అన్నారు. గురువారం కొడమంచిలి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో జన్ భాగీదారి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రీస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం సీతారామ్ మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్న పిల్లల్లో మానసిక ఉత్తేజాన్ని నింపడానికి ఆట బొమ్మలతో బొమ్మల కొలువు ఏర్పాటు చేసి వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ బొక్కా రామకృష్ణ, వైసిపి నాయకులు పోలిశెట్టి వనమరాజు, బొక్కా కన్నారావు, గూడూరి బాబు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెనుమంట్ర:తల్లిదండ్రులు తమ పిల్లలను క్రమం తప్పకుండా బడులకు పంపాలని ఐసిడిఎస్ సిడిపిఒ మేరీ ఎలిజిబెత్ అన్నారు. గురువారం పెనుమంట్ర పెద చెరువుగట్టు వద్ద ఉన్న అంగన్‌వాడీ కోడ్ నెంబర్-5లో గ్రామ స్థాయిలో జన్ భాగీదారి కార్యక్రమంలో తల్లులతో అక్షరాలు, అంకెలతో రంగీలా వేయించారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ పిల్లలను క్రమం తప్పకుండా పాఠశాలకు వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఎన్.ధనలక్ష్మి , పివిఎస్ లక్ష్మి పాల్గొన్నారు.

పెనుమంట్ర: పాల్గొన్న అంగన్‌వాడీలు, తల్లులు

కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సిఐటియు ఆధ్వర్యాన మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కాంట్రాక్ట్ కార్మికుల పర్మిట్ లిస్టులో మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, ఆప్కోస్ కార్మికులు లేకపోవటం దారుణమని, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తానని ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన వాగ్దానాన్ని తుంగలో తొక్కారని విమర్శించారు. అనేక దశాబ్దాలుగా మున్సిపాలిటీలను నమ్ముకుని పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చేయకపోవడం దారుణమన్నారు. కరోనా సమయంలో రాష్ట్రాన్ని పరిశుభ్రంగా ఉంచిన మున్సిపల్ కార్మికులను పొగడ్తలతో ముంచి తీరా పర్మినెంట్ విషయం వచ్చేటప్పటికీ వారికి తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. భీమవరం పురపాలక సంఘంలో జనాభా పెరిగిందని, రోడ్లు, డ్రెయిన్లు పెరిగాయని, చెత్త పెరిగిందని, కానీ కార్మికుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతుందన్నారు. కార్మికులపై పని భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలక్ట్రికల్, వాటర్ వర్క్స్, డ్రైవర్స్, స్కావెంజర్స్ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కొబ్బరి నూనె, సబ్బులు సకాలంలో ఇవ్వట్లేదని, కాంట్రాక్ట్ కార్మికులకు బట్టలు ఇవ్వట్లేదని, రోజు భీమవరం పట్టణాన్ని పరిశుభ్రం చేస్తున్న కార్మికులు తీవ్ర ఎండలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినప్పటికీ నేటికీ అమలు చేయడం లేదని విమర్శించారు. సిపిఎస్ రద్దు చేస్తానన్న ముఖ్యమంత్రి జిపిఎస్ ముందుకు తీసుకురావడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా పోరాటాలకు కార్మికులు సన్నద్ధమవుతున్నారన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని భీమవరం మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ జ్యోతికి అందించారు. ఈ ధర్నాలో డి.జయరాజు, ఎలక్ట్రికల్ పి.భానువాటర్ వర్క్స్ పి.మోహన్, వాటర్ వర్క్స్ నీలాపు రాజు, నిమ్మకాయల ధనలక్ష్మి బంగారు వరలక్ష్మి, నీలాపు అప్పన్న, నీలాపు నాగేశ్వరరావు, ఎస్‌కె.నాగూర్, ధనాల పెద్దిరాజు, బంగారు యేసేబు, మోషే, బి.కామాక్షి పాల్గొన్నారు.

చెరువులు నింపేందుకు చర్యలు

ప్రజాశక్తి - కాళ్ల

పంట కాలువల ద్వారా స్వచ్ఛమైన నీరు రావడంతో మంచినీటి చెరువులు నింపే ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. అన్నయ్యకోడు ఛానల్ ద్వారా తాగునీటి చెరువులు నింపుకోవాలని ఆదేశాలు ఇవ్వడంతో జువ్వలపాలెం గ్రామంలో ఉన్న మంచి నీటి చెరువులు నింపుకునే అవకాశం వచ్చిందన్నారు. గ్రామంలో ఉన్న మంచి నీటి చెరు వులు పూర్తి స్థాయిలో నింపుతున్నామని గ్రామ ఉప సర్పంచి కఠారి లక్ష్మిపతి రాజు తెలి పారు. పంట కాల్వ నుంచి చెరువులోకి నీరు వెళ్లేలా కొత్త తూరలను, విద్యుత్ మోటార్ పనులను సుమారు రూ.70 వేలతో ఏర్పాటు చేశామన్నారు. మంచినీటి చెరువు నింపేందుకు అన్నయ్యకోడు పంట కాల్వ నుంచి వంతుల వారిలో నీరు రావడంతో పూర్తిస్థాయిలో నింపి రెండు పూటలా నీటిని కుళాయిల ద్వారా అందిస్తామన్నారు.



చెరువు నింపే పనులు పరిశీలిస్తున్న ఉప సర్పంచి

శ్మశానవాటికకు చేర్చి వంతెన నిర్మాణం

చిన్నపుల్లేరు గ్రామస్తుల ఆందోళన

పొంతనలేని సమాధానం చెబుతున్న అధికారులు

ప్రజాశక్తి - ఉండి

హిందూ శ్మశానవాటికకు చేర్చి వంతెన నిర్మించడం పట్ల స్థానిక ప్రజలు, హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. మండలంలోని చిన్నపుల్లేరు గ్రామంలో హిందూ శ్మశానవాటికకు చేర్చి వంతెన నిర్మిస్తున్నారు. దీనివల్ల తమకున్న కొద్దిపాటి శ్మశాన వాటిక స్థలం కనుమరుగైపోతుందని శ్మశాన వాటిక మధ్య నుంచి వంతెనకు దారి వెళ్తుందని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే తమ శ్మశాన వాటిక ఆక్రమణలకు గురైందని, ఉన్న కొద్దిపాటి స్థలం కూడా దారిగా వెళ్లిపోతే తమ పరిస్థితి ఏంటని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులను ఫోన్‌లో వివరణ కోరగా పంచాయతీ కార్యదర్శి తనకు వంతెన నిర్మిస్తున్నట్లు తెలియదని, అక్కడ వంతెన నిర్మించడానికి ఎటువంటి అనుమతులు లేవని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి వంతెన నిర్మాణాన్ని నిలుపుదల చేస్తామని తెలిపారు. గ్రామ రెవెన్యూ అధికారిని వివరణ కోరగా రైతు వారి ఇబ్బంది వల్ల వంతెన నిర్మాణానికి మురికి నీటిపారుదల శాఖ అనుమతులు ఇచ్చిందని, రైతులు తమ సొంత ఖర్చులతో అక్కడ వంతెన నిర్మాణం చేసుకుంటున్నారని తెలిపారు. శ్మశాన వాటిక స్థలం ఏమైనా ఆక్రమణలకు గురైతే సంబంధిత వారికి సర్వే చేసి ఇస్తామని తెలిపారు. స్థానికులు మాత్రం ఇప్పటికే చాలా స్థలం రైతులు ఆక్రమించారని ఆక్రమించిన స్థలంలోనే వంతెన నిర్మాణం చేపడుతున్నారని వారు ఆరోపిస్తున్నారు. ఏది ఏమైనా దీనిపై అధికారులు స్పందించి తగు చర్య తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేకపోతే తాము ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, దీనిపై వెనక్కి తగ్గేది లేదని వారు అంటున్నారు. శ్మశాన వాటిక స్థలం ఆక్రమించి వంతెన నిర్మించడం పట్ల హిందూ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

విద్యార్థుల ప్రతిభను గుర్తించి వారికి చేయూత అందించడమే జగన్ లక్ష్యమని ఎపి విద్యా సంక్షేమ మౌలిక వసతుల డైరెక్టర్ కొవ్వూరి వేణు మాధవ రెడ్డి అన్నారు. పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో నియోజకవర్గస్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పెనుమంట్ర హైస్కూలులో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పాలకొల్లు అధ్యాపక కో-ఆర్డినేటర్ కెవి.రావు ఆధ్వర్యంలో నగదు, మెమెంటో ఇచ్చి సన్మానించారు. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో కె.మానస 926, బైపిసి విభాగంలో టి.శాంతి 904, సిఇసి విభాగంలో జి.పావని 894, హెచ్ఇసి విభాగంలో కె.రమ్య 584లకు ఒక్కొక్కరికి రూ.15 వేల నగదు, మెమెంటో ఇచ్చి సన్మానించారు. పదో తరగతిలో 567 సాధించిన టి.హరితకు రూ.15 వేలు, 562 సాధించిన వి.మోహనకు రూ.10 వేలు, 561 సాధించిన కె.బాలనందినికి రూ.ఐదు వేలు, మెమెంటో ఇచ్చి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ డి.శారదజ్యోత్స్న, పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక, ఉప సర్పంచి భూపతిరాజు వెంకటశ్రీనివాసరాజు, హెచ్ఎం కె.సాయి సూర్యనారాయణరావు, జెడ్‌పిటిసి సభ్యులు కర్రి గౌరీ సుభాషిణి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

17న క్యాంపస్ ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్స్ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17వ తేదీ శనివారం హెటిరో లాబొరేటరీస్‌లో ఉద్యోగాల కోసం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డి.వెంకటేశ్వరరావు తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే విద్యార్థులు 2021, 2022, 2023 సంవత్సరాల్లో ఏదైనా బిఎస్‌సి డిగ్రీ (కెమిస్ట్రీ), పి.జి(కెమిస్ట్రీ), బిఫార్మసీ చేసిన మేల్ విద్యార్థులు అర్హులన్నారు. ఐటిఐ (ఫిట్టర్) చేసిన మేల్ విద్యార్థులు కూడా అర్హులన్నారు. అభ్యర్థులు విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు జిరాక్స్, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల ప్లేస్‌మెంట్ ట్రైనర్ కె.లక్ష్మణ్‌రావు 9701394660 సంప్రదించాలని సూచించారు.

18న ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - పెనుమంట్ర

బాల సంస్కార సెంటర్ టీచర్స్ కోసం ఈ నెల 18వ తేదీ మార్టేరులోని శ్రీమావుళ్లమ్మ ఆలయం వద్ద ఉన్న గౌరీశంకర దేవాంగ కళ్యాణ మండపతంతె ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నట్లు డివిజన్ కో-ఆర్డినేటర్ పవన్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పెనుగొండ, ఇరగవరం, పెనుమంట్ర, పోడూరు, ఆచంట మండలాల్లోని గ్రామాల్లో బాలబాలికలకు ప్రతిరోజూ సాయంత్రం రెండు గంటల పాటు చదువుతో పాటుగా శతక పద్యాలు, శ్లోకాలు, దేశభక్తి పాటలు, నైతిక విలువలు, మహనీయుల జీవిత చరిత్ర, యోగా నేర్పించేందుకు మహిళా టీచర్లకు ఈ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన మహిళలు గౌరీశంకర దేవాంగ కల్యాణమండపంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. వివరాలకు యేడిద పవన్‌కుమార్, డివిజన్ కో-ఆర్డినేటర్ 8074832528, 9494607680, 9542036699 సంప్రదించాలని తెలిపారు.

పదవ తరగతి ఒరిజినల్ మార్కుల లిస్టు పోయినది

ఏలూరు జిల్లా, నూజివీడు డివిజన్, ముసునూరు మండలం, ముసునూరు గ్రామానికి చెందిన గుడివాడ శోభనాచల యోగానంద గుప్త కుమార్తె గుడివాడ నాగ మనోజ్ఞదేవి తమ పదవ తరగతి ఒరిజినల్ మార్కులు లిస్టు పి.పి.నెం. 221058, బియిరింగ్ రోల్ నెం. 1613127595, రెగ్యులర్ ఒరిజినల్ మార్కులు లిస్టు నెం. పి.సి. 13/12363/0221058/జి5 నెంబరు కల్గిన ఒరిజినల్ మార్కులు లిస్టు ముసురూరులో తమ ఇంటి నుండి మీసేవా కేంద్రం వద్దకు వెళ్ళి వస్తున్న సమయంలో మార్గమధ్యంలో జారి పోయినది. కావున ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రసుకు తెలియచేయగలరు.

గుడివాడ శోభనాచల యోగానంద గుప్త
గుడివాడ నాగ మనోజ్ఞదేవి
ముసునూరు, ఏలూరు జిల్లా.
సెల్: 63023 25693

In the Court of the 3rd Addl. District Judge, West Godavari, Bhimavaram
E.P. 97/2022 in
Arbitration Case No. 5/2020

Between:
The Citizen Co-operative Society Ltd., having its Office at 11-7-194, Huda Colony, Saroor Nagar, Hyderabad, rep. by it General Manager. ***...Petitioner/ DHR***
AND
1. Chedella Murali Krishna
2. Chedella Ramesh

...Respondents/ Respondents

To:
1st JDR: Chedalla Murali Krishna, S/o. Koteswara Rao, R/o. D.No. 26-5-25, Kummarla Veedhi, Near Ramalayam, Balusumudi, Bhimavaram, West Godavari District.

పై నెంబరు E.P. లో 1st JDR అయ్యి మీకు యీ నెంబరు DHR, Sale నోటీస్లు కోర్టు ద్వారాను, పోస్టు ద్వారాను జారీ చేయించినప్పటికి 1వ JDR అయ్యి మీరు సదరు వేలపు నోటీస్లు తీసుకోకుండా తప్పించుకొనుచున్నారు. పై నెంబరు E.P. లో 1వ JDR అయ్యి మీ హాజరు నిమిత్తం కోర్టు వారు **ది. 11-7-2023వ తేదీకి వాయిదా వేసినారు.** కావున 1వ JDR అయ్యి మీరు సదరు వాయిదా తేదీ **ఉదయం 10.30 గం॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు తెలియచేసుకోవలెను. లేని ఎడల 1వ JDR అయ్యి మీ పరోక్షమందు సదరు E.P. గ్రంథము తీర్మానించడమగును.

M.V.V.SIVA SATYANARAYANA
Advocate, Bhimavaram
Cell: 9949345699